ఓంశ్రీసాయిరాం

యుగయుగాలనుండి, తరతరాలనుండి కోటానుకోట్ల కంఠాలతో కీర్తించబడిన భారతీయ సంస్కృతి, అందులోని వేదప్రమాణము కాలప్రభావముచేత మానవుని మనఃప్రభావముచేత దినదినము తరిగిపోవుచున్నది.

ఈనాడు వేద, వేదాంత శాస్త్రార్థములను చక్కగా సామాన్య ప్రజలకు అర్థమగుచున్నట్లు బోధించు వ్యక్తులు కరువైపోయినారు. ఈనాడు వేదములను సముద్ధరించలేకపోయినయెడల, భవిష్యత్తులో భారతదేశ స్థితిగతులు ఏవిధముగా మారునోకదా!

వేదప్రమాణములు నశించిన, భారతీయ కీర్తియే నశించిపోవును. భారతీయ ప్రాణము, ప్రమాణము వేదములపైనే ఆధారపడియున్నవి. కనుక, తిరిగి వేదములను పునరుద్ధరించునిమిత్తము సత్యసాయి సంస్థలు అనేక విధములైన ప్రయత్నములకు సంసిద్ధమైయున్నవి.

ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి శతవర్షములు జీవించిన వేదపండు. వేద, వేదాంత, వేదార్థములను గుర్తించిన మహాపండితుడు. విజయనగర సంస్థానమందు తన పాండిత్యమును ప్రకటించి గొప్ప కీర్తి సాధించినటువంటివాడు. ఆంధ్రదేశములో సాటిలేనిమేటి.

అతడు కేవలం వేదప్రమాణములతోనేకాక భక్తిప్రపత్తులందుకూడ తన జీవితమును పూర్ణము గావించిన వ్యక్తి. అతనికి స్వామిపై మక్కువ ఎక్కువ. అతని విశ్వాసమెట్టిదనగా, సర్వవేదసారమును గుర్తించి తన అంత్యజీవితమును స్వామి సన్నిధియందే గడుపుతూ వచ్చాడు. ప్రశాంతినిలయంలో 'శతవర్షములు' నింపుకున్నాడు.

అతని జ్ఞాపకార్థం వేదశాస్త్ర అభివృద్ధి నిమిత్తమై శ్రీసత్యసాయి ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి వేదశాస్త్ర పరిషత్ ను నేడు ప్రారంభించుచున్నాను.

అతడు ఎంతకాలమైనప్పటికి అమరుడనే చెప్పవచ్చును. అనంతమైన, అమృతమైన హృదయము కలవాడు. కనుక, అమరత్వాని కతనికి అధికారమున్నది.

అందుచే అతని ఆదర్శాలను, సద్గుణములను విరివిగా చాటవలయును. వేదప్రమాణములను ప్రధాన ఆధారముగా భారతీయులు అనుసరించి, వేదసంస్కృతిని పునరుద్ధరింపజేసిన, తిరిగి మన భారతదేశము ప్రాచీనవైభవముతో రూపొందునని ఆశిస్తూ ఆశీర్వదించుచున్నాను.

(భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారు అక్షయ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమినాడు- అనగా అక్టోబరు 14వ తేదీ, 1986న పూర్ణచంద్ర సభావేదికపై ఇచ్చిన ఉపన్యాసమునుండి)

..........................................................................................................................

సనిదర్శనం-భగవత్ప్రోక్తం

ఏకదా భగవాన్సత్యసాయీ స్వకర పంకజాత్।
శివలింగస్థిత స్వీయ చిత్రముత్పాద్య తత్క్షణాత్॥
శివస్స ఇత్యనేనోక్తః ఆయీత్యంబా ప్రకీర్తితా।
తత్సంయోగశ్శివస్సాంబః సాయీతి ప్రతిపాద్యతే॥
పశ్యేత్యుక్త్వా చ తచ్చిత్రం మహ్యం ప్రాదాద్దయామయః।
అహో భగవత స్సాక్షాత్ సాయినో మహిమాద్భుతః॥

భగవాన్ సత్యసాయీ పరమేశ్వరుడు ఒక పర్యాయము ఏకాంతమందిరములో తన దివ్యహస్తకమలమునుండి శివలింగము సృష్టించినారు. అందులో స్వామి ఆత్మబింబము చిత్రితమైయున్నది. అది అన్ని దివ్య లక్షణాలతో విరాజిల్లుచున్న సౌవర్ణబాణము. ఇది అతిచిత్రము. అపూర్వము చూడమని చూపినాడు ప్రభువు.

సః అనగా పరమశివుడు. ఈ శివలింగము పరమశివుని ఆత్మలింగము. ఆయీ అనగా అంబ. లలితా సహస్ర మిందుకు ప్రమాణము, స ఆయీ అనగా సంయోగముచేత సాయి అయినది. సాయీ అనగా సాంబశివుడు అని ప్రతిపాదింపబడినది.

అని స్వామి సెలవిచ్చి కనులముందు చూపి శాస్త్రప్రమాణముగా వివరించినాడు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయము. స్వామి సాక్షాత్తు మహామహిమాన్వితములుగల భగవంతుడు. వారు నాకు దయతో శివలింగము ప్రసాదించిరి.

అపూర్వ అవతార వైభవము

సత్యజ్ఞానానంద స్వరూపుడగు పరమేశ్వరుడు సృష్టి ప్రారంభకాలమున బ్రహ్మను సృజించి యతనికి ప్రపంచ సృష్టి సాధనముగ తనయందుండు వేదములనిచ్చి ఈ వేదములద్వారా ప్రపంచమును సృజింపుమని యాజ్ఞాపించెను. తదనుసారముగ బ్రహ్మదేవుడు తిర్యక్, మనుష్యాది వివిధ జీవులను, వాటికి జీవనాధారమగు భోగ్యప్రపంచమును సృజించెను.

దేవతలు స్వర్గాదిలోకవాసులు. మానవులును, పశ్వాదులును భూలోకవాసులు. స్వర్గాదిలోకములు కేవలము పుణ్యకర్మ ఫలమగు సుఖము ననుభవించుటకు యోగ్యమైనవి కాన భోగభూములు. ఈ మానవలోకము కర్మభూమి. ఇచ్చట పుణ్యకర్మలాచరించిన స్వర్గాదిలోకములకును, పాపకర్మలు చేసిన నరకాదులకును వెడలి సుఖదుఃఖములను అనుభవింతురు. పుణ్యపాపకర్మల నాచరించుటకనువగు స్థలముకాన దీనికి కర్మభూమియని పేరు. ఇచ్చట పుణ్యకర్మలాచరించి వాటి ఫలానుభవమునకై స్వర్గాదులయందు నివసించు భోగశరీరులగు దేవతలకు నచ్చట పుణ్యకర్మానుష్ఠానమునకు ప్రశక్తిగాని, యధికారముగాని లేదు. అందుచే వారికి సత్కర్మలను బోధించునవియు, పాపకర్మలను నిషేధించునవియునగు వేదశాస్త్రములతో బనిలేదు. అట్లే మానవలోకమున పశుపక్ష్యాది జీవులుకూడ పూర్వజన్మములందు పాపాచరణమువలన దుఃఖఫలభోగ మాత్రమున కుద్భవించినవి కాన నవియు భోగశరీరులే. కాన, పూర్వజన్మార్జిత పాప ఫలానుభవము తప్ప ప్రస్తుత జన్మమున పుణ్యకర్మాచరణకు పయుక్తమగు జ్ఞానముగాని, కరచరణాద్యవయవ సన్నివేశముగాని లేదు. క్షుత్, పిపాస, నిద్రభయాదులు మాత్రము కలిగియున్నవి. కనుక, నివి భోగశరీరులగుటచే నిహజన్మమున పుణ్యపాప ప్రసక్తిలేనందున నివి మృతినొందిన పిదప మానవులకువలె ప్రేతత్వముకూడ లేదని శాస్త్రములు చెప్పుచున్నవి. అట్టి పుణ్యపాప కర్మానుష్ఠానమునకధికారములేని పశ్వాదులకు తద్బోధకములగు వేదశాస్త్రములతో నేమి ప్రయోజనము? ఇక, పారిశేషిక న్యాయమున మానవునకు మాత్రము వేదశాస్త్రాదులు, విధినిషేధములు, సన్మార్గబోధకములగు మతములును ఆవశ్యకములు. మానవుడు దేవతలవలె మూఢస్వభావుడు కాడు. పుణ్యపాప మిశ్రమజన్ముడు. కనుకనే, వీనికి పశ్వాదులకంటె విశేషజ్ఞానము, పుణ్యపాపకర్మల ప్రవృత్తి నివృత్తులయందు స్వాతంత్ర్యము స్వభావసిద్ధములు. అందుచే సత్కర్మాచరణముచే దేవత్వము నొందుటకును, దుష్కర్మాచరణముచే రాక్షస, పిశాచ, తిర్యగాది జన్మల నొందుటకును అర్హుడు. సుఖదుఃఖప్రాప్తి వీనియాచరణాధీనమైయున్నది. కనుకనే, 'పుణ్యోవైపుణ్యేన కర్మణాభవతి, పాపః పాపేన' పుణ్యకర్మచే పుణ్యాత్ముడు, పాపకర్మచే పాపాత్ముడు నగుననియు,

అనాభోగాః పరంమృత్యుం పాపాస్సంయన్తి సర్వదా।
అభోగాస్త్వేవసంయన్తి యత్రపుణ్యకృతో జనాః॥

శ్రుతిస్మృతుల నుల్లంఘించి పాపమునే చేయువారు సుఖలేశముకూడ లేక క్రిమికీటకాది జన్మల నొందుదురు. శ్రుతిస్మృతి మార్గావలంబులు సర్వసుఖ భోగములతో గూడినవారై పుణ్యాత్ములు నివసించు స్వర్గమున నుందురని వేదములు చెప్పుచున్నవి.

పశుపక్ష్యాదులు స్వేచ్ఛావిహారులు, మానవులు ఇహపరలోక సుఖార్థులగుటచే శ్రుతి, స్మృతి, శాస్త్ర విహిత సదాచారుసారులు, ఇదియే మానవులకును, పశ్వాదులకునుండు భేదము.

మతయో యత్ర గచ్ఛన్తి తత్ర గచ్ఛన్తి వానరాః।
శాస్త్రాణి యత్ర గచ్ఛన్తి తత్ర గచ్ఛన్తి వై నరాః॥

స్వేచ్ఛానుసారముగా వ్యవహరించునవి వానరాదులు, శాస్త్రానుసారము వ్యవహరించువారు నరులు అని నర, వానరాదులకుండు భేదము.

సుఖప్రాప్తికిని, దుఃఖనివృత్తికిని సాధనమగు నిట్టి దుర్లభమగు మానవజన్మ లభించినను కలికాలవశమున మానవులు తరచుగ వేదశాస్త్రములందును, పరమేశ్వరాస్తిత్వమునందును విశ్వాసరహితులై వేదోక్తధర్మములనుండి పరాఙ్ముఖులగుచుండిరి. ఇందుకు కారణము కలిప్రభావము.

జితో ధర్మో హ్యధర్మేణ, సత్యంచైవానృతేన చ।
జితాశ్చోరైస్తు రాజానః, స్త్రీభిశ్చ పురుషాః కలౌ॥
సీదన్తిచాగ్ని హోత్రాణి, గురుపూజా ప్రణశ్యతి।
కుమార్యశ్చ ప్రసూయన్తే తస్మిన్ కలియుగే సదా॥

కలియుగమున అధర్మముచే ధర్మమును, అనృతముచే సత్యమును, చోరులచే ప్రజాపాలకులును, స్త్రీలచే పురుషులును జయించబడుదురు. మరియు, అగ్నిహోత్రాది సత్కర్మలును, గురుపూజయు నశించునని పరాశరస్మృతి వచనము.

విష్ణుపురాణమున

యదా యదా సతాంహానిః వేదమార్గానుసారిణామ్।
తదా తదా కలేర్వృద్ధిః అనుమేయా విచక్షణైః॥
న ప్రీతిర్వేదవాదేషు పాషండేషు దయారసః।
తదా తదా కలేర్వృద్ధిరనుమేయాద్విజోత్తమైః॥

వేదమార్గముననుసరించు సత్పురుషులెప్పుడు తగ్గెదరో, ప్రజలకు వేదవాదమునందును, వేదవాదులయందును ప్రీతి నశించుచో, నాస్తికులయందు దయారసమధికమగునో, అప్పుడు కలి విజృంభించినదని తెలుసుకొనవలెనని యున్నది.

పూర్వకాలమున మహర్షులు కలియుగమున ప్రజలేరీతిగ వ్యవహరించెదరో దానినంతయు దివ్యదృష్టిచే కనుగొని స్మృత్యాదులద్వారా విశదీకరించిరి. అవి అన్నియు నీకాలమున ప్రత్యక్షముగ గన్పట్టుచుండెను. సదాచారములకును, సర్వధర్మములకు నాపదసంభవించిన యీసమయమున దయారసపూర్ణుడగు పరమేశ్వరునకు, 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అను తన ప్రతిజ్ఞానుసారముగ తనచే సృజింపబడిన మానవలోకము నీ సంసార దుఃఖములనుండి యుద్ధరించుట యవశ్యకర్తవ్యమై యున్నది. నిరాకారుడగు పరమేశ్వరుడు పూర్వకాలమునగూడ లోకమునకిట్టి యాపదలు సంభవించిన సమయములో రామకృష్ణాది రూపముల నవతరించియు, నవతరించుచు, లోకమును ధర్మమార్గమున నడిపించి రక్షించునని వేదములో

యఃపూర్వ్యాయ వేధసే నవీయసే,
సుమజ్జానయే విష్ణవే దదాశతి, ఇతి.

పరమేశ్వరుడు సృష్టి ప్రారంభకాలమున బ్రహ్మరూపమున నవతరించి ప్రపంచమును సృజించెననియు, పిమ్మట నాయాధర్మగ్లాని సమయములలో రామకృష్ణాది రూపముల నవతరించి యత్యంత నూతనుడగుచుండుననియు చెప్పబడుచుండెను.

శ్రీసత్యసాయి అవతారమూర్తి

ప్రస్తుత మీ కరాళ కలికాలమున పరమేశ్వరుడు సర్వశక్తి సంపన్నులును, సర్వజ్ఞులును, సకలకల్యాణ గుణాభిరాములునగు శ్రీసత్యసాయీశ రూపమున నవతరించి వేదోక్త సనాతనధర్మ ప్రచారముచేయుచు, ప్రశాంతి విద్వన్మహాసభల ద్వారా చేయించుచు ననేక వేదపురుష సప్తాహయజ్ఞములు నాచరించుచు, విద్వన్మండలిచే నాచరింపజేయుచు లోకమునకు సర్వపాపక్షయద్వారా అభ్యుదయ నిశ్శ్రేయసముల చేకూర్చుచు మానవలోకమును సంసార దుఃఖసాగరమునుండి తరింపజేయుచుండెను.

అవతారము తల్లక్షణములు

'విష్ణోర్మూర్త్యంతరేణ పృథివ్యామవతరణమవతారః' పరమేశ్వరుడు మూర్త్యంతరమును ధరించి భూలోకమున నవతరించుటయే, అవతారము, అట్టి అవతారమూర్తులకుండు లక్షణములు సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్త్వము, సర్వజీవులయందును పరిపూర్ణదయారసము, శాంతస్వభావము, త్యాగము, ప్రేమ, సత్యనిరతి, ధర్మాచరణము, ధర్మప్రోధము మొదలగు లోకోత్తర సుగుణసంపదలు.

యద్యద్విభూతిమత్సత్వం శ్రీమదూర్జితమేవవా।
తత్తదేవావగచ్ఛత్వం మమతేజోంశ సంభవమ్॥

లోకముననే ప్రాణికి ప్రభావ, ప్రతిభా, విజ్ఞాన, సౌజన్య, సౌశీల్య, ఔదార్య, శమదమాది సద్గుణసమృద్ధియు కలిగియుండునో సత్కీర్తియు, లోకవిలక్షణ శక్తియు అట్టి వ్యక్తిని నా కళచే నవతరించిన మూర్తిగా తెలుసుకొనుము అని భగవంతుడు పార్థునకుపదేశించెను. మరియు, శ్రీమద్భాగవతమున 'అవతారాహ్యసంఖ్యేయాః హరేస్సత్వనిధేర్ద్విజాః' సత్వగుణనిధియగు

శ్రీమహావిష్ణువుయొక్క అసంఖ్యాకములగు నవతారమూర్తులు ఆయాసమయములలో లోకమున నవతరించిరనియు, నవతరించుచుందురనియునుండెను. పూర్వోక్తములగు నిట్టి అవతార లక్షణములకు నిలయమగుటచే శ్రీసత్యసాయీశులవతార పురుషులు.

త్రికాల జ్ఞానము.

స్వామి నిత్యము వేలకొలది జనులు తమ కష్టసుఖములను తెలిసికొనుటకు, తమ యభీష్టములను కోరుకొనుటకును వారి దర్శనమునకు రాగా అందరకు నతిప్రేమతో, సహనశక్తితో భూతభవిష్యద్వర్తమాన కాలమందలి విషయములను ప్రత్యక్షముగ జూచినట్లు చెప్పుచు కష్టనివృత్తికిని, ఇష్టప్రాప్తికిని తగిన యుపాయముల నుపదేశించి వారిని సంతసింప జేయుచుందురు. జ్యోతిశ్శాస్త్రమందలి జాతక స్కంధమును చిరకాలమభ్యసించిన పండితులుకూడ నొక్క జాతకమును పరిశీలించి సరిగ భవిష్యత్ఫలముల జెప్పుట కష్టసాధ్యము. అట్టి విషయమున ప్రతిదినము ననేకుల జీవితవిశేషములను, కాలత్రయ విషయములను వ్యక్తినిజూచినంతమాత్రమున తెలిసికొను ప్రతిభావిశేషము స్వామికి జన్మసిద్ధము.

సంకల్పసృష్టి

ఎప్పుడు, ఎచ్చట నే యే వస్తువు కావలెనని వారి మనస్సున సంకల్పముదయించునో ఆ క్షణమున నావస్తువు కల్పవృక్షమునుండివలె వారి కరకమలమునుండి యావిర్భవించుచుండును. ప్రశాంతినిలయమున స్వామి చరణసరోజ సన్నిధిలో జరుగుననేక వివాహమహోత్సవములలో నూతన వధువులకు రత్నఖచితసువర్ణమంగళసూత్రములును, వరులకు సువర్ణాంగులీయకములును, ఆయాసమయములలో సువాసినులకు పండిత ప్రవరులకును స్వర్ణముద్రికాద్యలంకార విశేషములును, ప్రతి సంవత్సరము ప్రశాంతినిలయమున జరిపించు వేదపురుష సప్తాహయజ్ఞమునందలి పూర్ణాహుతులలో సమర్పించు నవరత్నములును, మహాశివరాత్రి మొదలగు పర్వదినములందు పరశివస్వరూపమగు శిర్డిసాయి యభిషేక నిమిత్తము ముక్తాఫల మణిమిశ్రితమగు మణుగులకొలది పరిమళ భరితమగు విభూతియును, ప్రతి మహాశివరాత్రియందు లింగోద్భవకాలమున స్వీయముఖారవిందమునుండి స్ఫాటిక జ్యోతిర్మయ లింగములను, వైకుంఠఏకాదశీ మహాపర్వమున ననేక భక్తజనాకీర్ణమగు చిత్రావతీనదీ సైకతవేదికయందు నా యిసుకరాశినుండి యతిమధురమును, సురభిళమునగునదియును ఎంతమందిభక్తులకు ప్రసాదరూపమున పంచిపెట్టినను అక్షయమునగు నమృతముచే నింపబడి దట్టము చేయబడిన చిన్నసువర్ణకలశమును, దానికి తగిన బంగారు చంచాయును, ఈమొదలగు ననేక అద్భుత, అపూర్వ పదార్థములు శ్రీభగవాన్ సత్యసాయి సంకల్పసృష్టియే. మరియొక విశేష మేమనగ– అద్భుతశక్తిచే సృజింపబడుచున్న ఈ అపూర్వ పదార్థజాలమంతయు పరార్థముకొరకేగాని లేశమాత్రము స్వార్థముకొరకు కాదు. ఇంతకంటె నీశ్వరలక్షణము మరియేది కలదు! కాన నిట్టి మహామహిమసంపన్నులగు శ్రీసత్యసాయీశులు నవీనావతారపురుషులనుటలో సంశయమేల!

సహజపాండిత్యము, అపారవిజ్ఞానము.

స్వామి పండితగోష్ఠులలో ప్రసంగవశాత్ వేద, శాస్త్రస్మృతి, పురాణ, ఇతిహాసాదులలో నిగూఢముగానుండు విషయములను విశదీకరించునపుడు అనన్యసాధారణములగు వారి పాండిత్యవిజ్ఞానములు మహాపండితులగు శ్రోతలకు ఆశ్చర్యానందములు కలిగించుచుండును. వారు చెప్పు ప్రతివిషయముకును శ్రుతియో, స్మృతియో, పురాణవచనమో, వేదాంగములో మనకు సాక్షిగా కనబడుచుండును. ప్రశాంతినిలయములో, నొక శంకరజయన్తినాడు శ్రీస్వామి సన్నిధిలో నేనుపన్యసించుచు స్వామి దివ్యనామమగు 'సత్యసాయి' అను పదమునకు బ్రహ్మపరముగను, విష్ణుపరముగను, గాయత్రీపరముగను సప్రమాణముగ నర్థము చెప్పియుంటిని. మరునాడు సెలవుదీసుకొనుటకు స్వామి సన్నిధికిపోగా వారు స్వకరాంబుజమునుండి శివలింగ మిశ్రితమగు సత్యసాయిస్వరూప చిత్రమును సృజించి దానిని నాకు జూపించుచు నిట్లనిరి. 'స' అనగా శివుడు. 'ఆయీ' అనగా అంబ. కాన, 'సాయీ' అనగా 'సాంబశివ' అని సాయినామ నిర్వచనముచేసి దానిని నాకనుగ్రహించిరి. వెనుకటిరోజున నేను 'సాయి' శబ్దమునకు బ్రహ్మ, విష్ణు, గాయత్రీ పరముగ మాత్రమే యర్థము చెప్పియుంటిని, శివపరముగ చెప్పలేదుగాన, నీలోపమును పూరించుటకును, తమనిజ రూపము సర్వదేవాత్మకమగు పరశివస్వరూపమనియును బోధించుటకిట్లు నాకనుగ్రహించిరని తెలిసికొని సంతసించితిని. 'స' శబ్దమునకు 'శివ' యనియు, 'ఆయీ' శబ్దమునకు 'అంబ' యనియు నర్థమెచ్చట కలదని వ్యాకరణాది శాస్త్రములందు ప్రవీణులగు కొందరు శంకింపగా నిఘంటువులలోను, లలితాసహస్రనామభాష్యాదులలోను వ్యాకరణానుసారము స్పష్టముగ స్వామి చెప్పిన యర్థము కనబడుటచే దానినా పండితులకు జూపించగా 'స్వామి విజ్ఞాననిధి' యని వారాశ్చర్యమునొందిరి. స్వామి పాండిత్య విజ్ఞానములకిట్టి తార్కాణములనేకములు కలవు.

ఉపన్యాస విలాసము

స్వామి అతి దురవగాహములగు విషయములను మృదుమధుర భాషలో నాబాలగోపాలమునకు హృదయంగమముగ బోధించుచుందురు. వారి యుపన్యాసము గంగాప్రవాహమువలె యప్రతిహతమును, పవిత్రమును, మనోహరమును,

సంసారసంతాపనివర్తకమునై యుండును. గంగానదికి 'త్రిపథగా' అని పేరు. అనగా, స్వర్గమర్త్యపాతాళములను మూడు మార్గములద్వారా ప్రవహించునది. స్వామియొక్క వాక్స్రవంతికూడ 'త్రిపథగా' అనగా కర్మ, ఉపాసనా, జ్ఞానములను మూడుమార్గములద్వారా ప్రవహించును. ఈ రెండును అమృతవాహినులు, తాపత్రయనివర్తకములు. ఇక నీరెంటికిని భేదమేమన గంగ విష్ణుపాదారవిందమునుండి జనించెను. వాగ్రూపమగు గంగ సత్యసాయి ముఖారవిందమునుండి జనించుచుండెను. ఇట్టి వాగమృత వాహినిలోని యమృతమును వేలకొలది జనులు నిత్యము నిశ్శబ్దముగ నేకాగ్రచిత్తులై శ్రుతిపుటములతో గ్రోలుచు నానందపరవశులైయుందురు. శ్రోతలకు సరస్వతియో, బృహస్పతియో సాయిరూపమున వచ్చి మాటలాడుచుండెనాయను సందేహముదయించును. ఎన్నిగంటలుపన్యసించినను శ్రమగాని, పౌనరుక్త్యముగాని, నిరర్థక పదములుగాని కనబడవు. వారి వాక్కునందు సరస్వతి నృత్యముచేయుచుండును. ఎల్లప్పుడను సత్కర్మను, భగవద్భక్తిని, ఉపాసనను, జ్ఞానమును, నీతులను, వర్ణాశ్రమ ధర్మములను ననేక యుక్తులతో నుపాఖ్యానములతో ప్రబోధించుచుందురు.

## గ్రంథరచనా కౌశలము

బాల్యమునుండియు స్వామిరచనలు భక్తిరసభరితములు, నీతిదాయకములు, హితబోధకములు, జ్ఞానజనకములు, లలితపద విన్యాసములు. అప్పటికప్పుడు ఝుడితి స్ఫూర్తితో గద్య, పద్య, గేయరూపములగు కృతులనేకములు పారిజాతమునుండి మకరంద తుందిలములగు కుసుమపుంజములవలె వారి కలమునుండి కురియుచుండును. వారి రచనలు చదువునపుడా కథాసన్నివేశములన్నియును ప్రత్యక్షముగ జూచుచున్నట్లుండును.

అట్టి రచనలలో కొన్నిటినిచ్చట నుదహరించుచుంటిని. ప్రేమవాహిని, ప్రశాంతివాహిని, ధర్మవాహిని, ధ్యానవాహిని, జ్ఞానవాహిని, ఉపనిషద్వాహిని, గీతావాహిని, భాగవతవాహిని, ప్రశ్నోత్తరవాహిని, సందేహనివారిణి మొదలగునవి. ఇట్టి గ్రంథములెన్నియో లోకశ్రేయస్సు కొరకు వారు రచించిరి, రచించుచుండిరి. ఈ రచనలలో నొకటియైనను చదివి శతాంశమైన నాచరణలో పెట్టిన మానవుడు అనాయాసముగ దుస్తర సంసారసాగరమునుండి తరించి సుఖింపగలడు.

## వేదపురుష సప్తాహజ్ఞానయజ్ఞము

ప్రశాంతినిలయమున ప్రతి సంవత్సరము శారద నవరాత్రమహోత్సవములలో శ్రీస్వామిచే నిర్వహింపబడు వేదపురుష సప్తాహజ్ఞానయజ్ఞము లోకోత్తరము. ఆ మహాయజ్ఞము ద్వాపరయుగాంతమున శ్రీకృష్ణపరమాత్మ సమక్షమున ధర్మజునిచే జరుపబడినదియు, మహా భారతమున వేదవ్యాసులచే వర్ణింపబడినదియునగు రాజసూయ యాగమును ప్రేక్షకుల స్మృతి పథమున గోచరింపజేయుచుండును.

ఈ యజ్ఞ దీక్షారంభమున స్వామి స్వయముగ ఋత్విక్, పండిత మధ్యమున నాసీనులై వారందరిని కౌశేయ పీతాంబరముల చేతను, పుష్పమాలికలచేతను సగౌరవముగ సత్కరించి, వేదవిదులును సత్కులీనులునగు నా ద్విజపుంగవులద్వారా గణేశపూజన, పుణ్యాహవాచన, స్వస్తివాచక పూర్వకముగ లోకమున కభ్యుదయ నిశ్శ్రేయసములకొరకు యజ్ఞ సంకల్పమును జేయించి నారదాది దేవఋషులచే పరివేష్టితుడగు శ్రీమహావిష్ణువువలె భక్తజన పరివేష్టితుడై నానావిధ కుసుమాస్తీర్ణమగు రాజపథమున ముందునడచుచున్న సాయిగీతయను భద్రగజకిశోరము ననుసరించుచు యజ్ఞమంటపము నలంకరించెదరు.

అచ్చట లోకకల్యాణమునకై జరిపించుచున్న యా వేదపురుష సప్తాహయజ్ఞమున కంగములుగ సర్వప్రాణులకు నారోగ్యాభివృద్ధికై సూర్యనమస్కారములును, విద్యాప్రాప్తికొరకు బ్రహ్మవిద్యాస్వరూపిణియగు శ్రీలలితా పరమేశ్వరీ పూజయును, అంతశ్శత్రు సంహారమునకు చండీసప్తశతీ పారాయణమును, భక్తిజ్ఞానవైరాగ్యముల కొరకు శ్రీమద్భాగవత పారాయణమును, సర్వమంగళావాప్తికి లింగార్చనమును, సర్వైశ్వర్యములకొరకు రుద్రస్వరూపియగు అగ్నియందు శతరుద్రీయ హోమములును, సత్వగుణ, విద్యాసంపన్నులగు ఋత్విజులచే జేయించుచుందురు.

కృష్ణయజుర్వేదమామూలాగ్రముగ మహర్షితుల్యులగు బ్రాహ్మణులు స్వరాక్షరపద వృత్త లోపరహితముగ క్రౌంచ, మంద్రాతిరిక్తమగు (ద్రైవయోగ్యమగు) ధ్వనితో పారాయణము చేయించుచుందురు. అట్టి మంగళమనోహర శబ్దబ్రహ్మధ్వనిచే నీ దేశమొక్కటియేకాక ప్రపంచమంతయు సర్వపాప దుఃఖరహితమై సుఖసంపదల కాలవాలమగుట నిస్సంశయము.

ఈ యజ్ఞమున బ్రహ్మవిష్ణుశివాత్మకమగు పురుషత్రయ సమావేశమొక యపూర్వవిశేషము. వేదపురుషుడు, యజ్ఞపురుషుడు, అవతారపురుషుడు ఈ పురుషత్రయమిచ్చటవిరాజిల్లుచుండును. వేదపురుషుడనగ 'యోబ్రహ్మాణం విదధాతిపూర్వం యావైవేదాంశ్చ ప్రహిణోతితస్మై' అను శ్రుత్యనుసారము ఆదికాలమున వేదములు బ్రహ్మముఖమునుండి వెలువడెను. కాన, వేదపురుషుడనగ బ్రహ్మ. 'యజ్ఞోవైవిష్ణుః' అను శ్రుతిననుసరించి యజ్ఞపురుషుడనగ విష్ణువు. అష్టమూర్తిస్వరూపుడగు శివుని మూర్తులలో యాగకర్త యొక మూర్తియగుటచే స్వామి శివావతారపురుషుడు.

మరియు సాయిశబ్దార్థ ప్రస్తావనలో స్వామి స్వయముగ సాయిశబ్దమునకు సాంబశివార్థమును విశదీకరించుచు శివలింగమునందు తమ స్వరూపమును జూపుటచేతను, అనేకములగు అవతార లక్షణములు వారియందుండుటచేతను, స్వామి

శివావతారపురుషులు. ఇట్టి పురుషత్రయ సన్నివేశము ఇతరత్ర అసంభవముగాన నీ వేదపురుష సప్తాహయజ్ఞము లోకవిలక్షణము.

ఈ యజ్ఞమందలి విరామ సమయములలో స్వామి ప్రజాసమూహమునకు భక్తి, ధర్మ, జ్ఞాన ప్రబోధము చేయుచుండుటచే నీ యజ్ఞసందర్శనమునకు వచ్చిన ప్రజాసమూహము ఈ ప్రబోధరూపకమగు ప్రత్యక్ష ఫలమనుభవించి ధన్యులగుచుందురు.

పూర్వము కురుక్షేత్రమున కౌరవ పాండవులకు జరిగిన సంగ్రామ యజ్ఞమువలన లోకమునకు జరిగిన మహోపకారము భగవద్గీతా ప్రబోధము. స్వామిచే నిర్వహింపబడు నీ వేదపురుష యజ్ఞమువలన లోకమునకు కలుగుచున్న మహాలాభము వేద, ఉపనిషద్, గీతా, భాగవతాది మహాగ్రంథముల సారభూతమగు ధర్మ, కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యాదుల ప్రబోధము. సంగ్రామ యజ్ఞమున శ్రీకృష్ణపరమాత్మయును, ఈ వేదసప్తాహజ్ఞానయజ్ఞములందు శ్రీసాయిపరమాత్మయు ప్రవక్తలు. అచ్చట పార్థుడు శ్రోత. ఇచ్చట లక్షలకొలది భక్తజనులు శ్రోతలు. అది హింసామయమగు సంగరము, ఇది ప్రశాంతిమయమగు నధ్వరము. నిష్కామబుద్ధితో స్వధర్మాచరణము, శమదమాది సాధన సంపాదనము. ఆత్మజ్ఞాననిష్ఠ, ముక్తి ఇవియే ఉభయత్ర ప్రబోధసారములు. యజ్ఞమునకు అన్నదానము, ధక్షిణాదానము ప్రధానాంశములు. అవి జరుగనియెడల యజ్ఞము సంపూర్ణఫలప్రదముకాదని శ్రుతిస్మృతులలో నిట్లున్నది. 'యజ్ఞ ఆయుష్మాన్సదక్షిణాభిరాయుష్యాన్' 'సహస్రం బ్రహ్మణగ్ స్తర్పయతవై' 'అన్న హీనో దహేద్రాష్టం' ఇత్యాదులు. ధర్మమూర్తియగు స్వామి ఈ యజ్ఞములందు జేయు నన్నదానమునకు పరిమితి కానరాదు.

ధర్మజుడశ్వమేధయాగము చేయుసమయమున వేదవ్యాసులు నిట్లనిరి, 'రాజా! నీవశ్వమేధముచేయుచుంటివి కాన నొక్క యీ యశ్వమేధముచేతనే ననాయాసముగ మూడశ్వమేధముల ఫలముకలుగు నుపాయము చెప్పెద నట్లుచేయుము' అనెను. అది యెట్లని ధర్మరాజడుగగా, 'ఈ అశ్వమేధమందునే మూడశ్వమేధములకిచ్చు ధక్షిణను ఋత్విక్కులకొసంగినచో మూడశ్వమేధముల ఫలమొందెదవు' అని చెప్పగా నట్లుచేసి యశ్వమేధత్రయ ఫలమొందెను. అట్టి సూక్ష్మధర్మముల నెరింగి స్వామి యీయజ్ఞము లందపార దక్షిణలనిచ్చి ఋత్విగ్బృందము నానందింపజేయుదురు. ఇట్టి యజ్ఞసమయమునందేగాక నితరసమయములలో గూడ నిత్యము వస్త్ర, ధన, అభయ, సద్బుద్ధి దానములు స్వామికి సహజగుణములు. వారి దాతృత్వమనుపమానము. 'అసౌవా ఆదిత్యోర్యమా' 'యః ఖలువైదధాతి సోర్యమా' అను శ్రుతి మనకగుపడు సూర్యభగవానుడు ఆర్యముడనియు ఆయా ఋతువులకు తగునట్లు వృష్ట్యాద్యులద్వారా సంతతము లోకమునకు అన్నాదిభోగ్య పదార్థములనిచ్చు మహాదాతయనియూ అతడు అర్యమశబ్దవాచ్యుడగు సూర్యభగవానుడేయనియు చెప్పబడుచున్నది. ఇట్టి మహాదాతయగు స్వామి ఆర్యమమూర్తియేకదా!

మరియు నీయజ్ఞ దివసములో తమ భక్తులు ఒక్క నిముషమైనను భగవచ్చింతన రహితముగ నుండరాదను నభిప్రాయముతో రాత్రులందు హరికథా ప్రవచనములు, భగవత్సంకీర్తనములు, స్వామి రచించిన భక్తిరసభరితములగు 'రాధాభక్తి' మొదలగు నాటకములు స్వీయ వేదశాస్త్ర పాఠశాలా విద్యార్థులగు బాలురచే నటింపజేయుటయు, భగవద్విషయక 'శాస్త్రీయ' మనోహర సంగీత మహాసభలు మొదలగునవియు ననవరతము జరిపించుచు ప్రజాసందోహమును ఆనందపరవశము గావించుచుందురు. ఇట్లే ప్రతి సంవత్సరము నాయా పర్వదినములలో వసంతనవరాత్రము, శంకరజయన్తి, గురుపూర్ణిమ, శ్రీరామనవమి, శ్రీకృష్ణజయన్తి, వినాయకచతుర్థి, స్వీయవర్ధాపన మహోత్సవము, వైకుంఠైకాదశీ మొదలగు మహోత్సవములు విశేష వైభవముతో జరిపింపబడు చుండును.

## ప్రశాంతివిద్వన్మహాసభ

ప్రజలను ధర్మమార్గమున నడిపించుటయే స్వామియొక్క ఏకైకలక్ష్యము. అందులకై 'ప్రశాంతి విద్వన్మహాసభ' యనునొక సంస్థ నేర్పాటుచేసి దానియందు దేశమందలి మహాపండితులను సభ్యులుగాజేర్చి వారిద్వారా ధర్మప్రచారము చేయుచుండిరి. 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అర్జునా! నీవు నిమిత్తమాత్రముగ నుండుము. కర్తవ్యమంతయు నేనే జరిపెదను. అని శ్రీకృష్ణుడు పలికినట్లు ఈ విద్వన్మహాసభను నిమిత్తముగా జేసికొని అపారధర్మప్రబోధమును లోకమున నలుమూలల విస్తరింపజేయుచుండిరి. దీని శాఖలు దేశవిదేశములలో నాయా రాష్ట్రములందు నెలకొల్పబడుచున్నవి. ఈయుద్యమ మీకాలమున భారతీయార్ష సంస్కృతినుండి దిగజారుచున్న లోకమునకత్యవసము కదా!

## మహావిద్యాలయ, వైద్యాలయములు

అనాదియగు భారతీయ సంస్కృతి కల్పలతకు కరాళకరవాలమగు ద్వీపాంతరీయ భాషాసంస్కృతుల ప్రాబల్యముచే నైతికముగను, సాంఘికముగను, ఆధ్యాత్మికముగను, పతనమగుచు మానసిక, శారీరక రోగములకు గురియగుచున్న మానవ జాతిని జూచి స్వామి కరుణాతరంగితాంతరంగులై ప్రశాంతినిలయమున భారతీయ సంస్కృతికి మూలమగు వేదశాస్త్రముల యభివృద్ధి ద్వారా మానవుల మానసిక రోగశాంతికై వేదశాస్త్ర మహావిద్యాలయమును శారీరక రోగనివృత్తికై వైద్యాలయమును యచ్చట క్రమముగ వేదశాస్త్రపారంగతులగు నుపాధ్యాయులును, ధన్వంతరీ సమానులగు భిషగ్వరులను నియమించి లోకమునకు సద్విద్యారోగ్యముల నభివృద్ధి నొందించుచుండిరి.

ప్రశాంతినిలయము

పరమేశ్వరుడు సర్వవ్యాపియు, సర్వాంతర్యామియునైనను సత్యలోకమో, వైకుంఠమో, కైలాసమో, యొక యునికిగ జేసికొనినట్లు స్వామి చిత్రావతీ నదీతీరమందలి ప్రశాంతినిలయము నావాసముగ గ్రహించిరి. అచ్చట ప్రశాంతినిలయము సార్థకనామమైయున్నది. ఎచ్చట జూచిననూ ప్రశాంతి తొణకిసలాడుచుండును. మరియు ప్రశాంతినిలయమున స్వామి పాదపల్లవచ్ఛాయయందు నివసించు నంతకాలము సంసారఘోరారణ్యమును దాటి అష్టవిభూతులతో నిండిన పరమశివసన్నిధిలో విహరించుచున్నటుల నిరతిశయానంద మనుభవించుచుందుము. అది వారి ప్రభావాతిశయము. అచ్చట లక్షలకొలది జనులు నివసించుచున్నను ఎచ్చట జూచినను నిశ్శబ్దము, నిర్మలము, నిరుపద్రవము, నిష్కామము, నిత్యానందము. పూర్వము హిమాలయ శిఖరమున స్వస్వరూపాను సంధానరూపమగు తపము చేయుచున్న శంకరుని నిలయమగు స్థాణ్వాశ్రమమును కాళిదాసు

నిష్కంపవృక్షం నిభృతద్విరేఫం।
మూకాండజం శాంత మృగప్రచారం॥

ఈశ్వర తపస్సు నిశ్చలముగ సాగుటకై నందీశ్వరుని యాజ్ఞచే నాతపోవనమున చెట్లుకూడ గాలికి కదలుటలేదనియు, తుమ్మెదలు ధ్వని చేయుటలేదనియు, మృగములుకూడ సంచరించుటలేదనియు వర్ణించినటుల ప్రశాంతినిలయము ప్రకాశించుచుండును. స్వామిచే సుశిక్షితులును, వినయసంపన్నులునగు స్వయం సేవకులును స్వామి యాజ్ఞానుసారమీ లక్షలాది ప్రజలకు రక్షణ, సహకారముల నాచరించుచుందురు. ప్రభుశక్తికికూడ సాధ్యముగాని యీ క్రమశిక్షణ మచ్చట సతతము జాగురూకమై యుండును. మన జీవితకాలమున నిట్టి యపార మహిమలతో లోకకల్యాణమునకై యవతరించిన భగవాన్ శ్రీసత్యసాయీశుల దర్శన, స్పర్శన, సంభాషణ, సేవాభాగ్యములు లభించుటవలన మన మందరము ధన్యులము.

స్వామియొక్క మానవాతీత మహిమలను, సమగ్రముగ వర్ణించుట మానవులకెట్లు సాధ్యము! అయినను ప్రత్యక్షముగ నేను చూచిన స్వామి యపార మహిమలలో నొకలేశమాత్రమిచ్చట భక్తలోకమునకు విశదీకరించి జీవితమును సఫలము చేసికొంటిని. నాచే రచింపబడిన ‘శ్రీసత్యసాయి సువర్ణమాల యందలి యొక శ్లోకముచే స్వామిని నమస్కరించి యీ వ్యాసమునకు స్వస్తిచెప్పుచుంటిని.

స్వస్యావతారే విరతే ప్రవృద్ధం కలిం నిరోద్ధు పునరాగతాయ।
శ్రీకృష్ణదేవాయ జగద్ధితాయ శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే!

ద్వాపరయుగాంతమువరకు నచ్చటచ్చట తలదాచుకొని శ్రీకృష్ణ నిర్వాణమయిన వెంటనే తన సైన్యములతో విజృంభించిన కలిని నిర్మూలించుటకు మరల యవతరించిన శ్రీకృష్ణపరమాత్మవగు నీకు నమస్కారము.

.......................................................................................................................................

నవరత్నమాలా స్తుతిః

సత్యాయ సత్యస్థితయేసమాయ సతాంహి సంరక్షణతత్పరాయ।
సత్యేతరాలాప పరాఙ్ముఖాయ శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే॥

జ్ఞానాయ విజ్ఞానవిశారదాయ జ్ఞానప్రదా యాశ్రితరక్షకాయ।
దత్తావతారాయ దయామయాయ శ్రీసత్యసాయిన్! భగవన్నమస్తే॥

అత్ర్యంబకాయ త్రివిలోచనాయ శ్రీవ్యోమకేశాయచ కేశవాయ।
విద్యాధినాధాయ మహామహిమ్నే శ్రీసత్యసాయిన్! భగవన్నమస్తే॥

విభూతిభూషాయ విభూతిదాయ విభూత్తమాయాష్టవిభూతిధామ్నే।
భూతేశ్వరాయాథ భవాయ భూమ్నే శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే॥

అయాన్వితనాం పరిపాలకత్వాత్ సాయీతినామ్నా ప్రథితాయ లోకే।
సన్మంగళాచార విభోధకాయ శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే॥

సంకల్పమాత్రేణ పదార్థసృష్టౌ సంచారిణే చామరపాదపాయ।
పరార్థమేవాఖిలసృష్టికర్త్రే శ్రీసత్యసాయిన్! భగవన్నమస్తే॥

స్వస్యావతారే విరతే ప్రవృద్ధం కలింనిరోద్ధుం పునరాగతాయ।
శ్రీకృష్ణదేవాయ జగద్ధితాయ శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే॥

వాచా సుధాసమ్మితయా సయుక్త్యా ప్రగాఢ నాస్తిక్య హతాంతరంగాన్।
ప్రకుర్వతే చాస్తికసార్వభౌమాన్ శ్రీసత్యసాయిన్! భగవన్! నమస్తే॥

గోవిప్రవేదేష్వధికాదరత్వాత్ శ్రీకృష్ణ ఏవేతి మనీషివర్యైః।
సునిశ్చితాయేద్యతమాయ నిత్యం శ్రీసత్యసాయిన్! భగవన్నమస్తే॥
అకించనేనాపి మయాతిభక్త్యా శ్లోకాత్మికా స్తోత్రమయీ గుణాఢ్య।
శ్రీసత్యసాయీశ్వర కంఠదేశే సమర్పితేయం నవరత్నమాలా॥

.........................................................................................................

శ్రీసత్యసాయి స్తుతిమంజరి

ఆవాసః ఖలు తే ప్రశాన్తినిలయః శాంతేద్గృహం మానసం
శాంతాస్తే పరిచారకాః పరిసరప్రాంతేషు శాంతా జనాః।
దృష్టిశ్శాంతరసోజ్జ్వలా మధుమయీ వాగ్వైఖరీ శాంతిదా
సత్యం శాంతరసావతారపురుషః శ్రీసత్యసాయిన్! భవాన్॥
కర్మోపాస్త్యపునర్భవత్రిపథగా తాపత్రయోన్మూలినీ
గంగైవామృతవాహినీ త్రిపథగా సాయీశ తే భారతీ।
గంగా కింతు పురా తవాంఘ్రినళినాదావిర్బభూవ ప్రభో
సైషావాగ్వదనాంబుజాదిహ పునర్భేదస్త్వియానేవ హి॥
హుంకారేణ నిహత్య రాక్షసగణం దత్వా స్వరాజ్యం పునః
దేవేభ్యశ్చ రరక్ష లోకమఖిలం యః ప్రాక్పురప్రార్థితః।
యం సంసేవ్య మహామహీప్రభురభూత్ శ్రీకార్తవీర్యార్జునః
తస్యైవానఘ యోగినః ప్రతినిధిః శ్రీసత్యసాయిన్ భవాన్॥
ఆవేశాదవతారమూర్తిరభవత్ విష్ణోర్యథా బార్గవః
తద్వత్త్వం పరమేశ్వరస్య యమినః శ్రీశిర్డిసాయిప్రభోః।
జైగీషవ్య మునేశ్చ సౌభరిమునేరత్తస్య శాంతాత్మనః
కిం వా తైశ్చ వికల్పనైః విభు పరం బ్రహ్మైవ భోః కేవలమ్॥
శ్రీసాయీశ గణేశ్వరాద్భగవతో విష్ణోస్తథాశంకరాత్
వాగ్దేవ్యాశ్చ సమీరణాదపి రవేరగ్నేర్భువో వాసవాత్।
దేవేభ్యోప్యపరేభ్య ఏవ భజతా యద్యత్ఫలం లభ్యతే
తత్సర్వం త్వదవాప్యతే భువిభవాన్ తత్సర్వదేవాత్మకః॥
యా దేవీ భవసాగరాన్నతజనాన్విద్యాత్మనా త్రాయతే
శ్రుత్యంతోల్లసదాత్మశక్తివిభవా యా శాంభవీ శోభతే।
యా నిర్వ్యాజకృపారసార్ద్రహృదయా దీనేషు బోభూయతే
సా సాయీశపరాంబికా భగవతీ కుర్యాజ్జగన్మంగళమ్॥
త్రిపురమథనకారిన్ కామగర్వాపహారిన్
త్రిభువనసుఖకారిన్ భక్తబాధాపహారిన్।
సకలహృదయవాసిన్ శాశ్వతానందదాయిన్
జయజయ శివరూపిన్ పాహి మాం సత్యసాయిన్॥
మధురం మానసం యస్య వాణీచమధురా తథా।
క్రియాచ మధురా సోయం సత్యసాయీ జగత్ప్రియః॥
శాంతి స్సహచరీ యస్య దయాచ హృదయంగమా।
దమస్సఖా సుఖంచాత్మా సత్యసాయీ సచిద్ఘనః॥
భక్తపాలన దీక్షాయాం నిమగ్నోపి హియస్సదా।
నిర్లేపో రవివత్సోయం సత్యసాయీనిరంజనః॥
భక్తాఘవిషపాయీ చ ముక్తిదాయీ సతాం చ యః।
సనాతనమహామాయీ సత్యసాయీ సదాశివః॥

అక్రూరవరదః కృష్ణః పురా క్రూరాసురాంతకః।
అపూర్వసాయికృష్ణోయం క్రూరాక్రూరావనే రతః॥
రామార్థం రామచంద్రేణ కోటయో రక్షసాంహతాః।
రామార్థం సాయిచంద్రేణ సజ్జితా భక్తకోటయః॥
జానకీజాని నాసర్వే హతః పుణ్యజనాః పురా।
అద్య పుణ్యజనాస్సర్వే పాల్యంతే సత్యసాయినా॥
కలిసాధురితి వ్యాసః యదువాచ మహామతిః।
తత్సత్య మభవత్సత్యసాయీశోదయకారణాత్॥

........................................................................................................................................................

సాయిగాయత్రీ దర్శనము

అది త్రయీబృందావనము. మధ్యలో మురళీమోహన శ్యామసుందరమూర్తి మందహాస మొలింకించుచున్నాడు. ఆ రోజు క్రిస్మస్ పండుగ ముందు దినము. ఆ సమయమున గోధూళివేళ, సంధ్యారాగములు బృందావన ప్రాంగణమును పసుపు కుంకుమలతో బంగారు పూవులతో అలంకరించుచున్నవి. సనక సనందన నారదాది మహాభక్తగణముతో విరాజిల్లుచున్న శ్రీమహావిష్ణువువలె సౌవర్ణకాషాయాంబరధారి శ్రీసత్యసాయి పరమాత్ముడు రత్నసింహాసనముపై నాసీనుడైనాడు. భక్తవర్యులు ఆధ్యాపకులు, మేధావులు, పండితప్రకాండులు, పరమసాధ్వీమ తల్లులు, మోక్షార్థులు, విద్యార్థులు అలంకరించినారు.

శ్రీస్వామి అత్యంత ఆప్యాయముగా వారి కరుణాకటాక్ష వీక్షణములను నాపై ప్రసరించి, 'బంగారూ!' అని సంబోధించి ప్రసంగించమని ఆదేశించినారు. ఆ అమృతోక్తి నాధీవీధిలో విద్యుల్లేఖయై తళుక్కున మెరిసింది. అదే ఈ సత్యసాయిగాయత్రి మంత్రదీప్తిదర్శనం.

'ఓం సాయీశ్వరాయ విద్మహే
సత్యదేవాయ ధీమహి।
తన్న స్సర్వః ప్రచోదయాత్.
ఇలా గాయత్రీమంత్ర మావిష్కృతమైనది.

భక్తులారా! మంత్రార్థమిది–

శ్రీశ్రీశ్రీ సత్యసాయిని సాక్షాత్తు భగవంతుడని, గురువులవలన, శ్రుతిస్మృతి శాస్త్రప్రమాణములవలన, ముఖ్యముగా స్వానుభవమువలన నేను తెలుసుకొనుచున్నాను.

నిత్యసత్య పరబ్రహ్మస్వరూపుడు, పరంజ్యోతి, పరమేశ్వరుడే ఐన ఈ సత్యసాయి దేవుడు మాయొక్క బుద్ధులను సదాలోచనలయందు, సత్కార్యాచరణలందు, సత్కర్మానుష్ఠానములందు ప్రేరణ సేయునట్లు ప్రార్థించుచున్నాను.

ఈ సత్యసాయీమూర్తిని సత్యస్వరూపులుగా, సర్వదేవతా స్వరూపులుగా, సర్వజగద్వ్యాపకులుగా నా హృదయారవింద మధ్యమునందు మనఃపూర్వకముగా ధ్యానించుచున్నాను.

ఈ సాయి గాయత్రీ మంత్రము ఇతర మహత్తరగాయత్రీమంత్రరాజములవలె మహామహిమాన్వితమైనది. ఇది ఒక వేదమంత్రములాంటిది. ఇది చతుర్వింశతి. అనగా గాయత్రీఛందము ఇరువదినాలుగు అక్షరాలతో కూడికొని యున్నది. ఇది త్రిపాది. మూడు పాదములు కలది. ఒక్కొక్క పాదమునకు ఇరువదినాలుగు అక్షరసంఖ్య అన్నమాట. ఇది గాయత్రీఛంద లక్షణము.

దీనిలో ఒక అద్భుతవిశేషమున్నది. వరరుచి సూత్రము ప్రకారముగా ఇందు అక్షరసంఖ్య నూటతొమ్మిది యగును. మేరు పర్వతారోహణలో ఆఖరి మెట్టువలె మంత్రము నూటఎనిమిది పర్యాయములు జపించిన తరువాత లభించే సంసిద్ధికి ఈ 109 సంఖ్య చిహ్నము. సాయిభగవానుని ప్రసాదసిద్ధికిది మూలమంత్రము.

ప్రతి గాయత్రీ మంత్రమునకు ఒక ఋషియుండును. ఆ ఋషే ఈ ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి. ఒక అధిష్ఠానదైము ఉండును. దీనికి అధిష్ఠానదైవము శ్రీశ్రీశ్రీసత్యసాయీశ్వరుడే!

ఈ సందర్భములో మరొక విషయము విస్పష్టముచేయుచున్నాను.

ఈ సత్యసాయీ గాయత్రీ మంత్రములోని మూడవ పాదములో 'సర్వ' శబ్దము వచ్చినది. దీనినిజూచి కొందరు పండితులు సందేహించవచ్చును. ఏమంటే 'మూడవ పాదములో కూడ సాయి శబ్దమున్నప్పుడే సాయిగాయత్రీ అనుట సార్థకమగును. అది లేక సర్వ శబ్దము ప్రయోగించిరి. అపుడు గాయత్రి యగుటెట్లు సంభవము? అని.

పండితవర్యులారా! అట్లు సందేహించనక్కరలేదు. 'మంత్రమహార్ణవ మహాగ్రంథములో ఇందుకు ప్రమాణమున్నది. అందులో అనేక దేవతలను గూర్చిన గాయత్రీ మంత్రములున్నవి. ఉదాహరణకు హయగ్రీవ గాయత్రి ఇట్లున్నది–

'ఓం వాగీశ్వరాయ విద్మహే, హయగ్రీవాయ ధీమహి, తన్నో హంసః ప్రచోదయాత్' దీని మూడవ పాదములో హయగ్రీవ శబ్దము లేదు. హంస శబ్దమున్నది. అయిననూ ఇది హయగ్రీవ గాయత్రీ మంత్రమైనది.

కనుక, శ్రీసత్యసాయి గాయత్రిలోని సర్వశబ్దమున్నను 'సత్యసాయిగాయత్రీ' అని వ్యవహరించుటకు శాస్త్రసమ్మతము విహితము.

మరొక విషయము వివరిస్తాను. ఈ గాయత్రిలోని సర్వశబ్దము పరబ్రహ్మ వాచకము. తైత్తిరీయ నారాయణోపనిషత్తులో 'సర్వేభ్యస్సర్వశర్వేభ్యః' అను మంత్రవాక్యమునకు విద్యారణ్య భాష్యములో నిట్లున్నది.

'తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్' ఇతి శ్రుత్యా, 'సర్వాంతర్యామిత్వేన పరమేశ్వర సంయుక్తం సర్వరూపత్వం' అని సర్వశబ్దమున కర్థము. సచ్చిదానంద శుద్ధ నిర్గుణ పరబ్రహ్మార్థకత్వము అని చెప్పబడినది.

కావున బుధజనులారా! శ్రీసత్యసాయిగాయత్రి శుద్ధబ్రహ్మప్రతిపాదకమనియు, శ్రీసత్యసాయీశ్వరుడు సాక్షాత్ పరమేశ్వరుడనియు, పరమాత్మ స్వరూపుడనియు శ్రీసత్యసాయిగాయత్రీ మంత్ర పరమార్థము.

ఈ సాయిగాయత్రీ మంత్రము సులభముగా తెలియుటకై శ్లోకరూపములో ఈ క్రిందివిధముగా చెప్పవచ్చును.

యోదేవస్సత్యసాయీ నః బుద్ధిం ధర్మాదిగోచరామ్।
ప్రేరయేత్తస్యయత్తేజః తద్వరేణ్య ముపాస్మహే॥

అనగా వివరించుచున్నాను. ప్రకాశస్వరూపుడైన శ్రీసత్యసాయి పరమేశ్వరుడు మా బుద్ధిని సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసా త్యాగమయముగా చేయుచూ, మా హృదయారవిందములో నివసించి, ప్రేమతో మమ్ము సాకుగాత! అని సాయి మహస్సును ఉపాసించుచున్నాను.

ఈ సాయిమహస్సు చాలా విలక్షణమైనది. విశిష్టమైనది. సర్వశ్రేష్ఠమైనది. ఇది కేవలము శరీరావచ్ఛిన్నమైన, నిత్య సత్య శుద్ధచైతన్యమే! ఈ చైతన్య మహస్సు లోకమును సదా రక్షించుగాక!

సర్వేజనాస్సుఖినోభవంతు.